

ప్రపంచ సాహిత్యాన్ని నిశితంగా విశ్లేషించే వల్లంపాటి మానవ జీవితాన్ని కూడా అంతే నిశిత దృష్టితో పరికిస్తారు.

# బంధాలు

నమస్కారం సార్!

నా పేరు శివరామయ్య. మా పొలాలు సాగుచేసే రైతులు నన్ను శివప్ప అంటారు. చదువుకున్నవాళ్ళూ, చదువుకున్నామనుకున్న వాళ్ళూ, వాళ్ళు చదువుకున్నారని మనం అనుకోవాలనుకున్నవాళ్ళూ నన్ను మిస్టర్ శివయ్య అంటారు. నా ప్రాణస్నేహితుడు డాక్టర్ వెంకటేశ్ నన్ను "శివా" అని పిలుస్తాడు. ఇతరుల్తో నన్ను గురించి మాట్లాడేటప్పుడు శివుడు అంటాడు.

ఇంతకూ మీకు వెంకటేశ్‌ని గురించి చెప్పానా? లేదనుకుంటాను.

సమయం వచ్చినప్పుడు చెబుతాలెండి.

నేను నన్ను గురించి ఏం చెప్పాలన్నా వాణ్ణి గురించి చెప్పక తప్పదు.

ఎందుకంటారా? అదో పెద్ద కథ.

ఇంతకూ అసలు విషయమేమిటంటే ఈ ప్రపంచం - అంటే ఈ మనుషులు - పెదవుల్తో పలకరిస్తూ, నొసటితో వెక్కిరిస్తూ ఉంటారెందుకని - వీళ్ళు మనమీద ఎందుకు పడతారో, ఎప్పుడు కౌగిలించుకుంటారో ఎందుచేత అర్థం కాదని, ఎందుకని ఓ నేస్తగాణ్ణడిగాను.

"నీతోనేకాదురా నా తండ్రీ, అందరితోనూ అలాగే ప్రవర్తిస్తారు" అన్నాడు.

"ఎందుకూ?" అన్నాను.

"ఎందుకంటే - అది వాళ్ళ స్వభావం" అన్నాడు.

"అది సరేలేవోయ్, ఆ స్వభావం వాళ్ళకెందుకొచ్చింది?" అన్నాను మళ్ళీ.

"ఎందుకంటే....ఎందుకంటే...." అని ప్రారంభించి మిగిలిన భావాన్ని వాడు నవ్వుతో పూర్తిచేశాడు.

అలా వాడు నా అజ్ఞానాన్ని నాజూగ్గా వెక్కిరించి, తన అజ్ఞానాన్ని నవ్వుకింద దాచేశాడు.

అలా నా ప్రశ్నమాత్రం ప్రశ్నగానే మిగిలిపోయింది.

నేను మంచివాణ్ణి కాదంటారు మా బంధువులు. మంచి సంగతి అంతగా నాకు తెలీదుకానీ, నేను చెడ్డవాణ్ణి మాత్రం కాను.

నాకు తెలిసి నేను ఎవరికీ చెడ్డ చేయలేదు. చెడ్డ చేయనివాడు చెడ్డవాడెలా ఔతాడో మీరే చెప్పండి.

నేను అబద్ధం చెప్పటంలేదు సార్!

ఇప్పుడు నేనున్న స్థితిలో నాలాంటివాడు అబద్ధం చెప్పడంటే చెప్పడు.

నేను తాగుబోతుననేవారు కూడా లేకపోలేదు.

నేను తాగేమాట నిజమే - అప్పుడప్పుడూ.

నాకు తాగుడు అలవాటుకాదు.

నా మిత్రుడు వెంకటేశ్ "డ్రింక్ ఈజ్ ఎ గ్రేట్ లిబరలైజర్" అంటాడు.

వాడికొచ్చినంత చదువు నాకు రాదు. నాకు తెలిసిందొకటే -

"నేను తాగుబోతునుమాత్రం కాను."

ఈ సంగతి ఈ గ్లాసు సాక్షిగా చెప్పగలను.

మరో విషయం సార్. నా గుణం మంచిదికాదనే వాళ్ళు కూడా మా బంధువుల్లో చాలామందున్నారు.

"గుణం అంటే ఏమిటి?" అన్నాను - ఆ మాటన్న ఒక బంధువుతో. అతడు నాకు మామయ్యవుతాడు.

అతడు ఇరుకు మాన్లో ఇరుక్కున్న దొంగగొడ్డులా గిలగిలలాడిపోయాడు.

"చెప్పవయ్యా గుణం అంటే ఏమిటో?" అన్నాను మళ్ళీ.

అతడు కాస్సేపు ఆలోచించి - "గుణం అంటే నీతి" అన్నాడు.

"నాకు నీతి లేదంటావా?"

"నువ్వు ఆమెతో సంసారం చేయటం నీతెలా ఔతుంది?" అని ఎదురుప్రశ్న వేశాడు, పైకప్పును చూస్తూ.

"ఎవరితో?"

"ఆదిలక్ష్మితో."

"ఎందుకో?"

"ఆమెది మన కులం కాదుగా."

"నాకు కులం మీద నమ్మకం లేదుగా" అన్నాను.

"మీరిద్దరూ పెళ్ళికూడా చేసుకోలేదు" అని గట్టిగా అరిచాడు.

"మా ఇద్దరికీ పెళ్ళిమీద కూడా నమ్మకం లేదుగా. ఒకవేళ చేసుకుందామన్నా నీలాంటివాళ్ళు ఒప్పుకోరుగా" అన్నాను.

ఆ మామయ్య అనేవాడికి ఒళ్ళు తెలియని కోపం వచ్చింది.

"ఛూ! నీ ముఖం చూడకూడదు" అని నిష్క్రమించాడు.

అంతేనండీ! ఆనాటితో నాకు బంధువుల్తో బంధాలు తెగిపోయాయి. నా వద్దకు రావటం కలిసికట్టుగా అందరూ మానేశారు.

అంతకుముందు పెళ్ళిళ్ళకో, చావులకో మొక్కుబడిగానైనా పిలిచేవారు.

ఆ తరువాత అందరూ కలిసికట్టుగా నా ముఖం చూట్టం మానేశారు.

నిజం చెప్పాలంటే నా బతుకులో ఆనందం ఆనాడే ప్రారంభమైంది. అది నా ఆస్తిపాస్తుల్తోపాటు చకచకా జ్యోన్నకర్రగా పెరిగింది.

ఇప్పుడు నాకు నేను శ్రద్ధ చూపకపోయినా చక్కగా సాగిపోయే వ్యాపారం ఉంది. నమ్మకంగా కొలిచ్చే రైతులున్నారు.


ఎంతో ఇష్టంగా కట్టుకున్న ఈ ఇల్లుంది. అందులో ఆదిలక్ష్మి

**నిజం చెప్పాలంటే నా బతుకులో ఆనందం ఆనాడే ప్రారంభమైంది. ఎంతో ఇష్టంగా కట్టుకున్న ఈ ఇల్లుంది. అందులో ఆదిలక్ష్మి ఉంది.**



చిత్రాలు: నర్సిం

**అక్కయ్య తలవంచుకుని నిలబడి ఉంది. "ఎలా ఉన్నావురా తమ్ముడూ" అంటూ నా ఒళ్ళంతా తడుముతూ కన్నీళ్ళు కార్చేయసాగింది.**



ఉంది. చూడండి సార్!

ఆదిలక్ష్మిని "ఇల్లాలు" అని మీరు అంటారో అనరో అది పూర్తిగా మీ ఇష్టం. కానీ, నా ఇష్టం వచ్చినట్టుగా ఉండటం నాకిష్టం.

ఈ విషయం తెలిసిన ఒకే ఒక నేస్తగాడు డాక్టర్ వెంకటేశ్.

ఆఁ...వెంకటేశ్‌ను గురించి ఇంతకుముందే చెప్పానుగా.

మనిషంటే వాడే సార్. కత్తి లాంటి మనిషి.

వాడు నాకు రెండోనేస్తం. మొదటి నేస్తం ఆదిలక్ష్మి. వాడికీ నాకూ నేస్తం కాలేజీలో పోట్లాటతో ప్రారంభమైంది.

వాడు నన్ను అనవసరంగా అవమానించాడు.

వాడు నాకన్నా తెలివైనవాడూ, బలమైనవాడూ కావటంచేత నేను వాణ్ణేమీ చేయలేకపోయాను.

రెండో రోజు ఏం జరిగిందో తెలుసా సార్?

వాడు నరాసరి నా గదికొచ్చేసి నా చేతులు పట్టుకొని, క్షమించమని కోరుతూ కౌగిలించుకున్నాడు.

అంతే!

ఆ కౌగిలింత ఇంకా విడిపోలేదు.

వాడు మంచి మూడ్‌లో ఉన్నప్పుడు అంతటి జ్ఞానీ, తత్వవేత్తా మరొకడు ఉండడు. వాడొకసారి -

"ఒరే శివా! మీవాళ్ళు నీకు దూరంగా ఎంత కాలం ఉండగలర్లేరా" అన్నాడు. అప్పుడు మేము వెన్నెల్లో కూచొని కబుర్లు చెప్పుకుంటున్నాం.

వెన్నెల నులివెచ్చగా కురుస్తోంది. పెరట్లో ఉన్న కొబ్బరి చెట్లు వెన్నెల్లో స్నానం చేస్తూ మత్తుగా ఉన్నాయి - మాలాగే. కొబ్బరాకుల మీదనుంచీ వెన్నెల తెల్లతెల్లగా, వచ్చవచ్చగా జారుతోంది.

అవి కత్తుల్లా తళతళమంటున్నాయి. పాముల్లా సరసరమంటున్నాయి.

"ఎప్పటికీ రారేమో" అన్నాను.

"ఎందుకు రారూ?" అన్నాడు వాడు.

"వాళ్ళకి నేనంటే ఇష్టంలేదుగా."

"ఒరేయ్, ఈ లోకంలో బంధుత్వాలు ఇష్టాయిష్టాల మీద మాత్రమే ఆధారపడవురా" అన్నాడు వాడు.

"నాకు దగ్గర బంధువులు మాత్రం ఎందరున్నారూ? మా అక్కయ్య, మామయ్య, మా అన్నయ్య - అంతేగా?"

"బంధువులు నల్లుల్లాంటివాళ్ళు ముగ్గురున్నా చాలు" అన్నాడు వాడు నవ్వుతూ.

మామూలుగా నవ్వితేనే వాడు బావుంటాడు. వాడు గొంతుతోకాదు, కళ్ళతో నవ్వుతాడు. ఇక వాడు వెన్నెల్లో నవ్వితే వాడి నవ్వుకు పోలికల్లేవు సార్. ఇంతలో ఆదిలక్ష్మి గమగమలాడే వళ్ళేలతో రావటంతో మా మాటలు మారిపోయాయి.

అలా నవ్వుల్ని గురించి ఆలోచిస్తూ, నల్లుల్ని గురించి మరిచిపోయాను.

కొంతకాలం తరువాత ఒక విచిత్రం జరిగింది. ఒకరోజు తల తిరిగి బాత్‌రూంలో పడిపోయాను.

ఉన్నట్టుండి తల తిరిగినట్టనిపించింది....

అదిగో అలా నవ్వకండి సార్.

మీ నవ్వుకు కారణం నాకు తెలుసు. అలాంటిదేం లేదు. నేను మామూలుగానే ఉన్నాను...ఇంతకూ చెప్పొచ్చిం దేమిటంటే, తల తిరిగింది... పడిపోతున్నానని పించింది.... పడిపోయే ఉంటాను.

తెలివొచ్చేసరికి ఆస్పత్రిలో ఉన్నాను.

ఒకవైపు వెంకటేశ్, మరోవైపు ఆదిలక్ష్మి చెరో చెయ్యి పట్టుకొని కూచేసున్నారు.

నిజం చెప్పొద్దూ - నాకూ బలే నవ్వొచ్చింది. కానీ, నవ్వలేకపోయాను.

నేనలా ఆస్పత్రిలో పడుకోనుండటం ఎందుకో అసహజమనిపించింది.

నేను ఆస్పత్రిలో పుట్టనూలేదు....పుట్టాక వెళ్ళనూ లేదు.

వెంకటేశ్ ఏవేవో పరీక్షలు చేశాడు. మందులిచ్చాడు. ఉప్పు, కారం తగ్గించమన్నాడు. తెల్లవారుజామున షికారు వెళ్ళాలన్నాడు.

"తీర్థ"యాత్రలు మానేయాలన్నాడు.

కనీసం కొంతకాలం గౌతమ బుద్ధునిలా ఉండాలన్నాడు.

అలాగేనన్నాను. వాడు చెప్పటం, నేను వినకపోవటం ఉండదుకదండీ? అప్పుడండీ - వాడి కళ్ళు నవ్వాయండీ.

"ఏమిట్రా నీకింత జబ్బుచేసినా మీవాళ్ళు రాలేదు?" అన్నాడండీ వాడు.

"ఒరే వెంకటేశ్, మావాళ్ళ సంగతి నీకు పూర్తిగా తెలీదురా. వాళ్ళకు నేనన్నా నా బతుకన్నా పరమ అసహ్యం. నేను చచ్చినా వాళ్ళు రారురా" అన్నాను.

అప్పుడు వాడు అదోరకంగా - "అలాగా?" అన్నాడండీ.

వాడు "అలాగా" అన్నాడంటే కొంప మునిగిం దన్నమాటే.

వాడితో చదరంగం ఆడుతూ మనం "చెక్" అన్నప్పుడే, టైంబాంబులాంటి ఆలోచన వాడి బుర్రలో వెలిగి నప్పుడేతప్ప వాడు "అలాగా?" అనడండీ....మరో పదిరోజులు ఆస్పత్రిలోనే. విశ్రాంతి తీసుకొని ఇంటికి తిరిగొచ్చాను.

ఆ రోజు రాత్రి తొమ్మిది గంటలకు సోఫాలో అటూ ఇటూ దొర్లు తున్నాను. ఆస్పత్రి నుంచి ఆ రోజే వచ్చాం కదండీ - నా ఇల్లే నాకు కొత్తగా ఉంది. నిద్ర రావటంలేదు. కానీ, మగత మగతగా ఉంది.

"ఒకవేళ నేను చచ్చిపోయి ఉంటే ఆదిలక్ష్మి ఎంత బాధపడేది?"

ఈ ఆలోచనకు భయపడి మగత పారిపోయింది.

ఆందోళనపడటం మంచిదికాదు కాబట్టి అలాంటి పిచ్చి ఆలోచనల్ని రానివ్వకూడదనుకున్నాను. రానివ్వ కుండా ఏం చేయాలి?

ఆదిలక్ష్మి ఎదురుగ్గా ఉంటే అలాంటి పిచ్చి ఆలోచనలురావు కాబట్టి ఆవిణ్ణి పిలుద్దాం - అను కుంటున్నాను.

అప్పుడు మామయ్య మహాశయుడు తక్కుతూ తారుతూ లోపలికొచ్చాడు.

"ఇదేమిటి మామయ్యా దారితప్పి చెడిపోయిన వాడి ఇంటికి వచ్చేశావ్?" అన్నాను - ఆదిలక్ష్మిని పిలవటం మానుకొని.

"అదేమిట్రా అలా అంటావ్? మనమేమన్నా శత్రువులమా? నువ్వు ఎంతకాదన్నా నా అల్లుడు కాకుండాపోతావా?" అన్నాడు, నిజం చెబుతున్న వాడిలా ముఖంపెట్టి.

"నువ్వు నిజంగా నా కోసమే వచ్చావా మామయ్యా?" అన్నాను చిలిపిగా.

"మరెందుకనుకున్నావ్‌రా. ఆఁ...... అన్నట్టు మరో శుభవార్త...ఇందిర పెళ్ళి నిశ్చయమైపోయింది. నా పరిస్థితి నీకు తెలుసుగా. ఈ పెళ్ళి జరిపించే భారం నీదే" అన్నాడు, ఉచ్చువేశాను, ఎలా తప్పించుకుంటావో చూద్దాం - అన్నట్టుగా.

''ఇందిరెవరు మామయ్యా?'' అన్నాను.

మా మామయ్య నోరు తెరిచాడు - దొంగ ఆశ్చర్యంతో.

''నా పెద్ద అమ్మాయిరా'' అన్నాడు ఆశ్చర్యం నుంచి తేరుకున్నట్టు నటిస్తూ.

అప్పుడు కొంగుతో చేతులు తుడుచుకుంటూ హాల్లోకొచ్చింది ఆదిలక్ష్మి.

''డైనింగ్ హాల్లోకొస్తారా, ఇక్కడే వడ్డించమంటారా?'' అంది మామయ్యనుద్దేశించి.

''భోజనానికి లెయ్ మామయ్యా'' అన్నాను, ఆదిలక్ష్మి చిలిపితనాన్ని కొనసాగిస్తూ.

చివ్వున లేచాడు మామయ్య. ఆదిలక్ష్మినీ, నన్నూ కత్తులు విసిరినట్టుగా చూసి, ఏదో అనబోయి మానుకుని, పోర్షన్ మరిచిపోయిన నటుడిలా నిష్క్రమించాడు.

''లోపలికి రండి భోంచేద్దురు కానీ'' అంది ఆదిలక్ష్మి - మామయ్య రావటం, వెళ్ళటం కూడా మరిచిపోయినదానిలా.

ఆందోళన తగ్గటానికి దోహదంచేసిన మామయ్యకు ధన్యవాదాలు తెలుపుకుంటూ భోజనానికి లేచాను.

మరునటి రోజే రెండో ఆశ్చర్యం ఎదురైంది.

ఇంకా గూట్లో పొద్దు గూట్లో ఉండగానే ఎవరో తలుపు తడుతున్న శబ్దం వినిపించింది. వినుక్కుంటూ వెళ్ళి నేనే తలుపు తీశాను.

అక్కయ్య తలవంచుకొని నిలబడి ఉంది.

''నువ్వా!'' అన్నాను ఆశ్చర్యపోతూ.

అక్కయ్య పూనకం వచ్చినదాన్లా తలుపు తోసుకొని లోపలికి వచ్చేసింది.

''ఎలా ఉన్నావురా తమ్ముడూ'' అంటూ నా ఒళ్ళంతా తడుముతూ కన్నీళ్ళు కార్చేయసాగింది.

''నాకేం....హాయిగా ఉన్నాను'' అన్నాను.

''నువ్విలా అంటున్నా వంతే... మాకు దూరమైపోయినందుకు లోపల్లోపల నువ్వెంత కుమిలి పోతున్నావో నాకు తెలీదనుకున్నావా? నువ్వు.... నువ్వు నా అల్లుడు కావాల్సిన తమ్ముడివి. అది.... అది...''

''ఎవరక్కయ్యా - ఆదిలక్ష్మా? లోపల నిద్ర పోతోంది'' అన్నాను.

మా అక్కయ్య ముఖం దుఃఖంతో నిండిపోయింది.

''అవున్రా నిద్రపోతుంది..... ఎందుకు నిద్ర పోదూ? అదే ఇల్లాలైతే ఇలా నిద్రపోతుందా? ఇప్పుడే ఇలా ఉందే నీ పరిస్థితి! మరికొంత కాలానికి నిన్ను చూసేవాళ్ళెవరూ, నీ గతేం కావాలీ?.... నిన్ను చూస్తే కడుపు తరుక్కు పోతోందిరా శివన్నా.''

మా అక్కయ్య ధారాపాతంగా ఏడవటం ప్రారంభించింది.

అక్కయ్య కన్నీళ్ళు పిలవగానే ఎంత సులభంగా పలుకుతాయో ఆలోచిస్తూ కూర్చున్నాను.

మా అక్కయ్య అంత కష్టపడి ఏడుస్తున్నప్పుడు నేను మధ్యలో మాట్లాట్టం మర్యాద కాదుకదా సార్!

మా అక్కయ్య అలా ఏడ్చి ఏడ్చీ అలిసి పోయింది. ఉన్నట్టుండి ఏడుపు ఆపి రహస్యం చెబుతున్నట్టుగా అంది -

''చూడ్రా శివన్నా ఇప్పుడైనా మించిపోయింది లేదు. నువ్వు హాయిగా శశిని పెళ్ళిచేసుకో.''

నిజం చెబుతున్నా సార్. కోపంతో నా గుండె ఆగినంత పని జరిగింది.

''ఛీ! నీకు బుద్ధిలేదూ? నా వయసెంతనుకున్నావ్?'' అన్నాను కాస్త తమాయించుకొని.

''ఎంతైతేనేం?'' అంది అక్కయ్య.

''ఎంతైనా ఫరవాలేదా? నీ కూతురు గొంతు కోస్తావా?''

మా అక్కయ్య చిరునవ్వులోకి మారిపోయింది.

''అదేమిట్రా శివన్నా ముసలితనం వచ్చినట్టు మాట్లాడుతున్నావ్! నీకు ముప్పై ఏడేళ్ళేగా? శశికి మాత్రం వయసు మించిపోలేదా? తెచ్చిన సంబంధాన్నంతా కాదని అదిమాత్రం ముప్పై ఏళ్ళు నెత్తిమీదికి తెచ్చుకోలేదా?''

ఇలా సాగింది సార్ సంభాషణ.

నాకు ముప్పై ఏడేళ్ళు కాదు, నలభై రెండన్నాను.

మా అక్కయ్య మించిపోయిందేం లేదన్నది.

శశికి పాతికేళ్ళు దాటలేదన్నాను.

ఎలాంటి సంకోచమూ లేకుండా ముప్పైయో ఏడు జరుగుతోందని దబాయించింది మా అక్కయ్య.

ఆవిడను భరించలేకుండా మర్యాదగా వెళ్ళి పొమ్మన్నాను.

వెళ్ళకుండా అరుపులూ అఘాయిత్యాలూ ప్రారంభించింది.

చిట్టచివరికి మా అక్కయ్యను దాదాపు బలవంతంగా బయటకు తోసి తలుపు వేయాల్సి వచ్చింది.

అందుకు నాకు బాధగానే ఉంది సార్! ఎంత కాదన్నా మేమిద్దరం ఒకే రక్తం పంచుకొని పుట్టిన వాళ్ళం కదా. కానీ, ఏం చేస్తాం చెప్పండి?

నేనేమో ఉద్రేకాల మనిషిని.

ఆలోచించటం, జుట్టు పీక్కోవటం నా తత్వానికి పడదు.

కానీ సార్, ఆ రోజు ఆలోచించక తప్పలేదు. ఏమిటీ ప్రపంచం? ఏమిటీ మనుషులు? ఏమిటీ బంధాలు?

అలా ఆలోచిస్తూ ఉండిపోయాను.

అదిలక్ష్మి నా మానాన నన్ను వదిలేసి తన పనీ పాటా చూసుకుంటోంది. రెండు మూడుసార్లు ఆవిణ్ణి గమనించాను.

ఆవిడేం చెప్పలేదుకానీ, ఆవిడ చిరునవ్వు మాత్రం చాలా విషయాలు చెప్పింది. వ్యంగ్యంగా ముడుచుకున్న పెదవుల వెనక ఆవిడేదో జీవిత రహస్యాన్ని దాచుతున్నట్టనిపించింది.

అలాగే పొద్దు మధ్యాహ్నమైంది.

భోజనానికి లేద్దాం అనుకుంటూ ఉండగా వచ్చాడండీ మా అన్నయ్య - నేలకు తగులుతున్న కారియర్‌తో, సిగ్గుతో ముడుచుకుపోయిన ముఖంతో.


మళ్ళీ మామూలు గొడవే.

అనుబంధాల విలువ. తెంచుకున్నా తెగని బంధాల గట్టితనం. రక్తం పంచుకోవటం. ఒకే తల్లి కడుపులో పుట్టటం....ఇలా ఎన్నో.

నా పిచ్చికానీ ఇవన్నీ మీకు తెలీవా సార్?

ఓ అరగంట తరువాత చిరునవ్వుతో వచ్చిన అన్నయ్య వెర్రికోపంతో కేకలుపెడుతూ వెళ్ళిపోయాడు - టిఫిన్ కారియర్‌తోపాటు.

**భోజనానికి లేద్దాం అనుకుంటూ ఉండగా వచ్చాడండీ మా అన్నయ్య - కారియర్‌తో, సిగ్గుతో ముడుచుకుపోయిన ముఖంతో.**



**అక్కయ్య అడిగిన ప్రశ్నకు "సరదాకి చెప్పాను" అన్నాడు వెంకటేశ్. అప్పుడు వాడి కళ్ళే కాదు వాడి ముఖమంతా నవ్వుతో వెలిగిపోయింది.**



గుండెల మీద బరువు దిగినట్టనిపించి భోజనానికి లేచాను.

భోజనం వద్ద భోజనం గురించి తప్ప మరో విషయం గురించి ఆదిలక్ష్మి మాట్లాడలేదు.

ఆ రోజు రాత్రి.....

"ఉదయం శశి వచ్చింది" అంది ఆదిలక్ష్మి నెమ్మదిగా.

"ఉదయం ఎప్పుడొచ్చిందీ?" అన్నాను.

"మీరు అక్కయ్యతో మాట్లాడుతుండగా వచ్చింది - పెరటివైపు నుంచి."

"ఎందుకూ?"

"మిమ్మల్ని పెళ్ళిచేసుకోవటం ఇష్టంలేదట" అంది ఆదిలక్ష్మి, నాజూగ్గా నవ్వుతూ.

"ఎంత అవమానం! ఎందుకట?"

"మరో అబ్బాయిని పెళ్ళిచేసుకోవాలట."

"ఎవరో ఆ అబ్బాయి? నాకు పోటీదారు."

"ఎవరో డాక్టరుగారి అబ్బాయట."

"పేరు?"

"చెప్పింది. మర్చిపోయాను."

మళ్ళీ చిలిపి చిరునవ్వే.

ఆలోచనలోపడ్డాను.

"మీతో మాట్లాడాలట. శశిని రమ్మంటారా?" మళ్ళీ అంది ఆదిలక్ష్మి.

"రమ్మంటే బావుంటుందంటావా?"

"అదేమిటి? కొత్త సంగతులు ఆలోచిస్తున్నారు?"

నిజమే నాకే నవ్వొచ్చింది.

"రమ్మనండి. .బావుంటుందో లేదో తరవాత ఆలోచిద్దాం."

"సరే...రమ్మను.." అన్నాను.

మరో నెల తిరిగింది.

జారిపోతుందేమో అనుకున్న ఆరోగ్యం గట్టిగానే చేతికి చిక్కింది.

ఈలోగా రెండుసార్లు ఆస్పత్రికి వెళ్ళాను. వెంకటేశ్‌తోపాటు మరిద్దరు డాక్టర్లు మరిన్ని పరీక్షలు చేసి 'నువ్వు రాక్షసి ముండాకొడుకువి' అన్నారు ప్రియంగా.

మందులు మానేయమన్నారు.

ఈలోగా ఉదయం షికారు ఒక హుషారుగా అలవాటైంది.

బాగా బరువు తగ్గింది. ఆరోగ్యం పెరిగింది.

"మెడికల్‌గా నువ్వు ముందటికంటే ఎంతో ఆరోగ్యంగా ఉన్నావురా" అని యోగ్యతాపత్రం ఇచ్చాడు డాక్టర్ వెంకటేశ్.

"అదేమో నాకు తెలీదు కానీ, వయసు తగ్గినట్టు మాత్రం కనిపిస్తున్నారు" అంది ఆదిలక్ష్మి.

ఆ రోజు — నేనూ, వెంకటేశ్ డాబామీద కూచొని కబుర్లు చెప్పుకొంటున్నాం.

ఇంకా కొంతకాలంపోతే అమెరికావాళ్ళు మనం ఏ రోజు ఏ కూర చేసుకోవాలో, ఎన్ని గంటలకి అన్నం తినాలో, ఎన్ని గంటలకి పడుకోవాలో కూడా చెబుతారని జోకులేస్తూ నవ్వుతూ, నవ్విస్తూ ఉన్నాడు వెంకటేశ్.

ఇంతకుముందే చెప్పానుగదా సార్ వెన్నెట్లో వాడు నవ్వితే నా కిష్టమని. వాడు మామూలుగానే నవ్విస్తూ, తన కళ్ళతో నవ్వుతున్నాడు.

శివపూజలోకి ఎలుగొడ్డలా అప్పుడొచ్చారండీ మా అక్కయ్యా, అన్నయ్యాను.

"ఒరే శివన్నా ఉదయం నుంచీ శశి కనిపించటం లేదురా?" అంది అక్కయ్య ఏడుస్తూ.

"నిజంగానా?" అన్నాను ఆశ్చర్యం నటిస్తూ.

వెంకటేశ్ నాకుమాత్రం అర్థమయ్యేలా నవ్వాడు.

"నిజంగానేరా" అంది అక్కయ్య.

"ఎక్కడికెళ్ళింది?"

"ఏ బావిలో దూకి చచ్చిందో ఎవరికి తెలుసూ?"

అయ్యో ఎంత ఘోరం! ఇంట్లో ఉత్తరమేమైనా పెట్టి వెళ్ళిందేమో చూశారా? బావులూ, చెరువులూ వెదికించారా! నా పిచ్చికానీ, బావుల్లో, చెరువుల్లో నీళ్ళెక్కడున్నాయ్" అన్నాను.

అప్పుడు చూశాడు సార్ మా అన్నయ్య టీపాయ్ మీదున్న వస్తువుల్ని.

"మళ్ళీ ప్రారంభించావురా తాగుబోతు వెధవా. ఇలాగైతే ఆరునెలల్లో కాదు, నెల్లోనే పోతావ్" అన్నాడు ఎంతో ఉదారంగా.

అంతవరకూ నిశ్శబ్దంగా కూచొని వినోదం చూస్తున్న డాక్టర్ వెంకటేశ్ చేతిలో ఉన్న గ్లాసుతో పాటు లేచి, నెమ్మదిగా అన్నయ్య ముందుకెళ్ళాడు.

కంబళిపురుగు మీదికొస్తున్నట్టుగా అసహ్యించుకున్నాడు అన్నయ్య. వెంకటేశ్ వాడి వెన్నెల నవ్వు, నవ్వి అన్నాడు -

"వాడికి మరో పాతిక సంవత్సరాలు గ్యారంటీ రాసిస్తాను. ఈమాట నేను డాక్టరుగా చెబుతున్నాను."

అక్కయ్య వెంకటేశ్ మీదికో విషపుచూపు విసిరింది.

"అదికాదయ్యా - వీడికి క్యాన్సరొచ్చింది. ఆరు నెలలు బతకటం కూడా కష్టం అని చెప్పావు కదయ్యా" అంది అక్కయ్య ఆశ్చర్యంలో మునిగిపోయి తానేం మాట్లాడుతోందో తనకే తెలియని స్థితిలో.

"సరదాకి చెప్పాను" అన్నాడు వెంకటేశ్.

అప్పుడు వాడి కళ్ళేకాదు - వాడి ముఖమంతా నవ్వుతో వెలిగిపోయింది.

"ఛీ, నీతిలేని వెధవల్లారా!" అంటూ నిష్క్రమించాడు అన్నయ్య.

కూతురి సంగతి మరిచిపోయి దిగ్భ్రమనుంచి తేరుకోకుండానే అక్కయ్య అన్నయ్య వెంట కదిలింది.

"అక్కయ్యా, శశి సంగతేమిటే" అన్నాను.

"చచ్చింది."

"అదికాదే. వెంకటేశ్ కొడుకు కూడా ఉదయం నుంచీ కనిపించటంలేదట."

"వాణ్ణీ చావమను."

నా మాట అర్థంచేసుకోవాలన్న ప్రయత్నం కూడా చేయకుండా అక్కయ్య వెళ్ళిపోయింది.

"ఆవిడ భాషలో చావంటే పెళ్ళి" అన్నాడు వెంకటేశ్, నింపాదిగా కూర్చుంటూ.

అదండీ కథ.

"ఒరేయ్ వెంకటేశ్, ఇకమీదట వీళ్ళు రార్రా" అన్నాను, వెళ్ళిపోతున్న రక్తంపంచుకొని పుట్టిన వాళ్ళను బాధగా చూస్తూ.

వాడు మళ్ళీ వాడి నవ్వు నవ్వి "అలాగా!" అన్నాడు సార్.

నేను అదిరిపడ్డాను.

నేను ఆస్పత్రిలో ఉండగా వాడు "అలాగా?" అన్నందుకు అర్థం ఇప్పుడు తెలిసింది సార్. ■